క్లుప్తంగా

హేమవిరలేశ్వరుని ఆలయంలో కార్తిక సమారాధన



భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన బాల త్రిపుర సుందరి దేవి సమేత హేమవిరలేశ్వర్వ స్వామి దేవాలయంలో ఆదివారం ఘనంగా కార్తిక వన సమారాధన నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రతి ఏటా కార్తిక మాసంలో స్వామి వార్లకు లక్ష బిల్వార్చన నిర్వహించి సమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సమారాధన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు

– ఎక్సైజ్ సీఐ గీతిక

కర్లపాలెం: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ గీతిక తెలిపారు. మండలంలోని పేరలి గ్రామంలో ఆదివారం బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఈవూరి అమలను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 21 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ గీతిక మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయాలు చేసినా, నాటుసారా తయారు చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దాడులు నిర్వహించిన వారిలో ఎస్‌ఐ ప్రభుదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



బాపట్ల: బాపట్ల పట్టణంలోని రాజ్యలక్ష్మీనగర్‌లో ఏర్పాటు చేసిన అభయ ఆంజనేయస్వామి విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 8న అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. విగ్రహం ఏర్పాటు చేసి 16 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గో పూజ, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పళ్ల రసాలతో అభిషేకం చేశారు. కార్తిక మాసం పురస్కరించుకొని సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు సీజ్



కొల్లిపర: అనుమతులు, వే బిల్లులు లేకుండా శనివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అత్తలూరిపాలెం వద్ద కృష్ణా నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో దాడులు చేసినట్లు చెప్పారు. ఆరు ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. ఉచిత ఇసుక తరలించే వాహనాలకు కూడా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వే బిల్లు ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

ఘనంగా గంగానమ్మ కొలుపులు



కొల్లిపర: మండల పరిధిలోని మున్నంగిలో ఆదివారం కులమత భేదాలు లేకుండా గంగానమ్మ కొలుపులు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయాన్నే కొలుపులను పురస్కరించుకొని గంగానమ్మ ప్రతిరూపమైన ఘటాన్ని గ్రామంలో ప్రతి వీధిలో మేళ తాళాలతో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు పాడి పశువులతో ఆలయం చుట్టూ తిరుగుతూ పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. పిల్లలు, మహిళలు మెడలో గారెలు, బూరెలు దండలుగా ధరించి తలపై మొలకెత్తిన గింజలు మూకుడుతో అడుగులు మడుగులు పాటిస్తూ మొక్కుబడులను తీర్చుకున్నారు.

తెనాలి టూ టౌన్ సీఐ బాధ్యతల స్వీకారం

తెనాలి రూరల్: తెనాలి టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రాములుల నాయక్ బాధ్యతలు శనివారం స్వీకరించారు. ఆయన మార్కాపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా సెప్టెంబర్ 12న ఇక్కడ సీఐగా బాధ్యతలు స్వీకరించిన నిసార్ బాషాను గుంటూరు వీఆర్‌కు ఉన్నతాధికారులు పిలిపించారు. గోప్యంగా సీఐల బదిలీ జరగడం ఆదివారం చర్చనీయాంశమైంది.

సమస్యలు కేరాఫ్...

వసతి గృహం

- కనీస వసతులు కరువు
- వసతి గృహాల్లో విద్యార్థులే వంట మాస్టర్లు, స్వీపర్లు
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని వైనం
- అస్తవ్యస్తంగా మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం
- కిలోమీటర్ల మేర నడిచి బహిర్భూమికి వెళ్తున్న విద్యార్థులు



చెత్త మధ్యనే పడుకుంటున్న విద్యార్థులు

బాపట్లటౌన్: వారంతా పేదలు.. వెనకబడిన వర్గాలకు చెందిన పిల్లలు.. నిరుపేదలైన వీరు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వసతి గృహంలోనే ఉండి చదువుకుంటున్నారు. ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం కారణంగా వసతి గృహాల్లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధ్వానంగా గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం

పట్టణంలోని గిరిజన కళాశాల బాలుర వసతి గృహంలో విద్యార్థులు పడుతున్న కష్టాలు అన్ని ఇన్నీ కావు.

- కళాశాలలో 72 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో రాసుకున్నారు. వాస్తవంగా ఉన్నది కేవలం 28 మంది మాత్రమే. చదువులు పూర్తయిన విద్యార్థులు కూడా ఇప్పటికీ వసతి గృహంలోనే మకాం వేసి ఉంటున్నారు.
- వాచ్‌మెన్, స్వీపర్, వంట మనిషి మొత్తం ఆల్ ఇన్ వన్‌గా శ్రీను అనే వ్యక్తి మాత్రమే ఉన్నారు.
- ఆయన ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియదు. ఎప్పుడొచ్చినా అడిగేవారే లేరు. అసలు వార్డెన్ ఏ రోజూ వసతి గృహంలో అందుబాటులో ఉన్న దాఖలాలు లేవు.
- కిటికీలకు మెస్‌లు లేవు. దీంతో దోమలు విద్యార్థులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. విద్యార్థులు పడుకునే గదిని కనీసం ఊడ్చే వారు లేరు. చెప్పులు, చెత్త, చెదారం మధ్యలోనే విద్యార్థులు పడుకుంటున్నారు.
- వంట గదిలో వ్యర్థాల నిల్వలు పేరుకుపోయి ఉన్నాయి. గ్రైండర్ నెలల తరబడి కడగక, దుర్గంధం వెదజల్లుతుంది.
- వసతి గృహం చుట్టూ ముళ్ళ చెట్లు పెరిగి విష సర్పాలకు ఆవాసంగా మారింది. ప్రాంగణంలో చెత్త, చెదారం, వ్యర్థాలు పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపించేలా ఉంది. మురుగు నీరు చుట్టూ నిలిచి దోమలకు నిలయంగా మారింది.
- వసతి గృహంలో మొత్తం 10 మరుగుదొడ్లు ఉన్నా ఒక్కటి కూడా సక్రమంగా పనిచేయటం లేదు. దీంతో విద్యార్థులు బాటిల్స్‌లో నీళ్ల తీసుకొని కిలోమీటర్ల మేర బహిర్భూమికి వెళ్తున్నారు.
- వంట మనిషి సక్రమంగా వంట చేయకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ హోటల్స్‌ను ఆశ్రయిస్తున్న దుస్థితి. కొందరు అయితే అన్న క్యాంటీన్‌లకు వెళ్తున్నారు.
- వంట వచ్చిన విద్యార్థులు ఇక్కడే వంట చేసుకుని పొట్ట నింపుకుంటున్నారు.



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి



ప్రమాదంగా ఉన్న స్విచ్‌బోర్డు

- వండిన వంటను మూతలు లేకుండా డైనింగ్ హాల్‌లో పెట్టి వెళ్లిపోతున్నారు. వాటిపై ఈగలు, దోమలు వాలి అధ్వానంగా ఉంటోంది. దీంతో దాన్ని తినేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. వండిన అన్నం, కూరలను పొద్దున్నే చెత్త కుండీలో పారేయటం ఇక్కడ షరామామూలైంది.
- సరిపడా ఫ్యాన్లు కూడా లేవు. ఫ్యాన్లు రిపేరైనా విద్యార్థులే రిపేరు చేసుకోవాల్సిన దుస్థితి.
- స్నానాల గదులకు డోర్లు సక్రమంగా లేవు. కనీసం నెలకు ఒకసారైనా మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్న దాఖలాలు లేవు.
- వసతి గృహంలోని స్విచ్ బోర్డులు దెబ్బతిని వైర్లు బయటకు కనిపిస్తున్నాయి. ఎక్కడ షాక్ తగులుతుందోనని విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

పట్టణం నడిబొడ్డున, జిల్లా కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న వసతి గృహంలో విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నా ఇప్పటివరకు కనీసం ఏ ఒక్క అధికారి కూడా ఆ అటు వైపు తొంగిచూసిన దాఖలాలు లేవు. పేపర్లలో వార్తలు వచ్చినప్పుడు హడావుడి చేయటం తర్వాత వదిలేయటం అధికారులకు షరామామూలైంది. పట్టణం నడిబొడ్డున ఉన్న వసతి గృహం పనితీరే ఈ విధంగా ఉంటే మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని వసతి గృహాలు ఇంకెంత అధ్వానంగా ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది.

సమైక్యతను చాటేదే వన సమారాధన

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



భట్టిప్రోలు: పద్మశాలీ సంఘీయులంతా సంఘటితంగా ఉండి తోటి వారికి సహాయపడే విధంగా ఉండాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మార్కండేయ పద్మశాలీయ బహుత్తమ సేవా సంఘం (అద్దేపల్లి-భట్టిప్రోలు) ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన మహోత్సవం నిర్వహించారు. స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో సమారాధన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ ప్రశాంతమైన గ్రామీణ వాతావరణంలో కార్తిక వన సమారాధన సంఘీయుల సమైక్యతను చాటుతుందని అన్నారు. సత్యన్నారాయణ స్వామి వ్రతంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి కూడా విచ్చేశారు. కార్యక్రమంలో శ్రీమార్కండేయ పద్మశాలీయ అద్దేపల్లి-భట్టిప్రోలు బహుత్తమ సేవా సంఘం నిర్వాహకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కర్లపాలెం: ఓ మైనర్ బాలిక అదృశ్యమైన ఘటన కర్లపాలెం మండల పరిధిలోని దుండివారిపాలెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్‌ఐ ఎ.రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం దుండివారిపాలెం గ్రామానికి చెందిన 17 సంవత్సరాల మైనర్ బాలిక ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైందని తల్లి పల్లపట్లాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి

శక్తివంచన లేకుండా పనిచేయాలి

రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



మాట్లాడుతున్న రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపలె రూరల్: గ్రామీణ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేలా నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రేపల్లె మండలం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం ఉన్నా లేకున్నా పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉంటుందన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా గ్రామ స్థాయి నుంచి నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడుతూ ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామ, మండల స్థాయి కమిటీలు ఐక్యంగా ఉండి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవటమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అధికార పార్టీ వేధింపులు, అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తకు అన్నివేళలా అందుబాటులో ఉంటామని భరోసానిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు మేడికొండ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రదర్శనలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రేపల్లె రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ నెల 26వ తేదీన జిల్లా కేంద్రాలలో ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీఐటీయు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ తెలిపారు. పట్టణంలోని సీఐటీయు కార్యాలయంలో ప్రదర్శన కార్యక్రమాల కరపత్రాలను ఆదివారం విడుదల చేసి అనంతరం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న విధానాలను నిరసిస్తూ 13 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతుల సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహించబడతాయన్నారు. రైతులు, కార్మికులు మరింత పేదరికంలోకి నెట్టబడడానికి మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కారణమన్నారు. కార్పొరేట్ల రుణాలను మాఫీ చేసి ప్రపంచ కుబేరులుగా అదానీ, అంబానీలు ఎదగడానికి మోదీ ప్రభుత్వం సహాయపడుతుందని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించేందుకు ప్రత్యేక నిధిని కేటాయించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పంట రుణాలు, నష్ట పరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పనిదినాలు కల్పించి రోజు వేతనం రూ.600 చెల్లించాలన్నారు. అదే విధంగా విశాఖ ఉక్కు, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులు తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ 26న బాపట్లలో జరిగే ప్రదర్శనకు కార్మిక, కర్షక ఐక్య ధర్నాలో నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలురైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ, రైతు, కౌలురైతు సంఘాల నాయకులు ఆశీర్వాదం, ఝాన్సీ, జె.ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయాలి

మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం

బాపట్లటౌన్: పేదల అభ్యున్నతే ధ్యేయంగా కాపు సేవా సంఘం నాయకులు పని చేయాలని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. మండలంలోని సూర్యలంక సమీపంలోని జీడిమామిడితోటలో ఆదివారం కాపు సేవా సంఘం వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా కాపు సంఘంలోని పేద విద్యార్థులు, పేద మహిళలకు చేయూతనిచ్చే విధంగా ముందుకు రావడం ఎంతో సంతోషమన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన 465 మంది విద్యార్థులకు రూ.20 లక్షల పురస్కారాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలోని వితంతు, ఒంటరి కాపు మహిళలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.ఎం.భాస్కరరావు, ఈఎన్‌టీ నిపుణులు ఏనుగుల చైతన్యమురళి, ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ అవంతి, మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్యప్రసాద్, కాపుసేవా సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, పర్వత రెడ్డి భాస్కరరావు పాల్గొన్నారు.

కొలకలూరు ఆశ్రమంలో ధ్యాన సత్సంగ్ వేడుకలు

తెనాలి: హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్ ఏపీ-ఐసీ-3 జోన్ ఆధ్వర్యంలో ఆదివారం రూరల్ మండలం కొలకలూరులోని జోనల్ ఆశ్రమంలో మినీ భండారా తరహాలో వేడుకలు జరిగాయి. జోన్ పరిధిలోని గుంటూరు, తెనాలి, బాపట్ల, చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, పొన్నూరు, రేపల్లె తదితర కేంద్రాలకు చెందిన అభ్యాసులు 850 మందికి పైగా పాల్గొన్నారు. పచ్చని పరిసరాలు, స్వచ్ఛమైన వాతావరణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సాధకులు మూడు ధ్యాన సత్సంగ్‌లను నిర్వహించారు. హార్ట్‌ఫుల్‌నెస్ పద్ధతికి సంబంధించిన విశేషాలను, మాస్టర్, మిషన్, మెథడ్‌లను సంస్థలో కొత్తగా చేరిన వారికి సీనియర్ సభ్యులు వివరించారు. కార్యక్రమాన్ని ఏటా ఒకటి లేదా రెండుసార్లు నిర్వహించాలని అభ్యాసులు కోరారు. సంస్థ జోనల్ కో-ఆర్డినేటర్ ఎస్. రామకోటేశ్వరరావు పర్యవేక్షించారు.

వైభవంగా కార్తిక వనసమారాధన వేడుకలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఖానస పరిషత్ సభ్యులు



పూజలు చేస్తున్న బ్రాహ్మణ సేవా సమితి నిర్వాహకులు

రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసం పురస్కరించుకుని పట్టణ, మండలంలో కార్తిక వనసమారాధన వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలో ఓల్డ్‌టౌన్ రాచూరు జమీందార్ వారి కోటలో వైఖానస పరిషత్ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ వ్రతం నిర్వహించి చిన్నారులకు, మహిళలకు పలు ఆటల పోటీలు, స్వామి వారి కీర్తనల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఖానస పరిషత్ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని పేటేరు గ్రామ దేవత మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారి ఆలయంలో, ఉప్పూడి సీతారామాంజనేయస్వామి ఆలయంలో కార్తిక వనసమారాధన వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారికి టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ పట్టు వస్త్రాలు అందించగా, సీతారామాంజనేయ ఆలయంలో జనసేన నాయకులు కమతం సాంబశివరావు, విజయకుమారి దంపతులు, గ్రామ నాయకులు దామెర్ల రాజారావు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా దేవాలయాలలో అన్నసంతర్పణ కార్యక్రమాలు చేశారు. కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో..

భట్టిప్రోలు: గాయత్రి బ్రాహ్మణ సేవా సమితి (భట్టిప్రోలు) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీ సాయి కృష్ణ కళావేదిక ఆవరణలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. అబ్బూరు వెంకట లక్ష్మి నరసింహ శర్మ, కూచిభోట్ల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిపల్లి వాసుకిరణ్, పెనుమర్తి కుటుంబరాయశర్మ, భారతుల శ్రీధర్ శర్మ, షణ్ముఖ శర్మ, సతీష్‌కుమార్, ఆమంచి సజన్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు. వేణుగోపాల స్వామికి సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. సమారాధన కార్యక్రమంలో భట్టిప్రోలు, కొల్లూరు, నగరం, చెరుకుపల్లి మండలాల నుంచి బ్రాహ్మణ కుటుంబాలు పాల్గొన్నాయి. నిర్వాహకులు, గాయత్రి బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు బీహెచ్ సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.



పేటేరులోని మహాలక్ష్మి గుండె పాటమ్మ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి

భక్తిశ్రద్ధలతో కార్తిక వన సమారాధన

బాపట్ల: విశ్వబ్రాహ్మణ కాలనీలో గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా ఆదివారం కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామికి, ఉసిరి చెట్లకు పూజలు నిర్వహించి వన సమారాధన నిర్వహించారు. అనంతరం వాస్తు సిద్ధాంతి మారెళ్ళ పోతులూరి వీర బ్రహ్మాచారిని ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వెదురుపర్తి లక్ష్మణమూర్తి, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కటలి జగదీష్, సెక్రటరీ చిత్తరంజన్ శర్మ, ప్రభాకర్ విశ్వకర్మ, సుబ్బారావు, సంఘ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని భార్యాభర్తల మోసం

తెనాలి రూరల్: ఉద్యోగం ఇప్పిస్తామని యువకుడిని భార్యాభర్తలు మోసం చేయడంపై తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేటకు చెందిన కనపర్తి మహేష్‌బాబుకు రాయనపాడు రైల్వే వర్క్‌షాప్‌లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ అతనికి పరిచయస్తులైన మరియదాసు, అతని భార్య సౌజన్య జనవరిలో రూ. 4.60 లక్షలు తీసుకున్నారు. 11 నెలలైనా ఉద్యోగం రాకపోవడం, డబ్బులు తిరిగి ఇవ్వమన్నా ఇవ్వకపోతుండడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. త్రీ టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తెనాలి అర్బన్: బోసు రోడ్డులోని క్రీస్తు దేవాలయం (టౌన్ చర్చి) నూతనంగా రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఆదివారం పాస్టర్లు దేవరపల్లి ఏసురత్నం, యామర్తి లెనిన్‌బాబు, దగ్గుమల్లి సాల్మన్‌రాజు, మత్తె విజయ భాస్కర్ ప్రకాష్‌బాబు ఆవిష్కరించారు.

ముస్తాబవుతున్న చర్చిలు

భట్టిప్రోలు: గ్రామాల్లో ఆదివారం నుంచి క్రిస్మస్ సందడి మొదలైంది. మండలంలోని పలు గ్రామాల కూడళ్లలో క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేస్తున్నారు. చర్చిలను అందంగా రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. క్రిస్మస్ పండుగ పర్వదిన వేడుకలను నిర్వహించుకోవడానికి క్రైస్తవులు సిద్ధమవుతున్నారు. వేడుకల్లో భాగంగా క్రైస్తవులు తమ గృహాలను శోభాయమానంగా తీర్చుదిద్దుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏసు క్రీస్తు పుట్టుకకు గుర్తుగా తమ ముంగిళ్లలో స్టార్స్‌ను ఏర్పాటు చేసుకుంటారు. క్రిస్మస్ పురస్కరించుకుని మండలంలోని గ్రామాలలో యువత ప్రత్యేకంగా క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. నెల రోజుల పాటు క్రైస్తవ ప్రార్థనా మందిరాలపై క్రిస్మస్ స్టార్లు కొలువై కాంతులు విరజిమ్మనున్నాయి. డిసెంబర్ 25వ తేదీన క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఆయా గ్రామాల్లో యూత్ ఏర్పాటు చేస్తున్న క్రిస్మస్ స్టార్స్ ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి.



భట్టిప్రోలులోని ఆర్‌సీఎం చర్చి



ఆళ్లమూడిలో క్రిస్మస్ స్టార్ ఏర్పాటు చేసే పనిలో యువత

ఐక్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం

చీరాల ఎమ్మెల్యే ఎంఎం మాలకొండయ్య



బాపట్లటౌన్: ఐక్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.మాలకొండయ్య తెలిపారు. మండల సూర్యలంక సముద్ర తీరంలోని జీడిమామిడి తోటలో ఆదివారం యాదవ వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత మహిళల ఆధ్వర్యంలో కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా యాదవులంతా ఐక్యంగా ఉండాలన్నారు. సమాజంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రతి ఒక్కరు పేదల అభ్యున్నతికి పాటు పడాలన్నారు. యాదవ సంఘం నాయకులు పమిడి భాస్కరరావు, గొలపల శ్రీనివాసరావు, మద్దిబోయిన సోమరాజు, పులివాసు, పిన్నిబోయిన ప్రసాద్, తోట నారాయణ పాల్గొన్నారు.